సాక్షి
నంద్యాల
మంగళవారం । 27 । మే । 2025



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారంసహస్రదీపార్చన సేవను నిర్వహించారు. ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



చందా ఇస్తేనే పంటలకు నీరు!

పంట కాలువను బాగు చేసుకునేందుకు చందాలు ఇస్తేనే మీ చేనుకు నీళ్లు .. లేదంటే రావు.. అంటూ వగరూరు గ్రామంలో టీడీపీ నాయకుడు దండోరా వేయించాడు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,591.15
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:11.836
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:6,595
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:302

న్యూస్‌రీల్

యోగాతో ఆరోగ్యకర జీవితం



యోగాసనాలు వేసిన దృశ్యం

శ్రీశైలంటెంపుల్: యోగా సాధన ద్వారా ఆరోగ్యకరమైన జీవితం, మానసిక ప్రశాంతత పొందవచ్చునని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం శ్రీశైలంలోని చంద్రవతి కల్యాణ మండపంలో యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. అనంతరం ఒంగోలుకు చెందిన ప్రముఖ శిక్షకులు, యోగాచార్య గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం యోగాసనాలు వేయించారు. శారీరక ఆసనాలు, శ్వాసపై ధ్యాస, ధ్యానం, ప్రాణాయామం, ముద్రలు మొదలైనవన్నీ యోగాలో ప్రధాన క్రియలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పలు విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గోరుకల్లు మరమ్మతులకు టెండర్లు

పాణ్యం: గోరుకల్లు జలాశయ కట్ట మరమ్మతులకు టెండర్లు ఆహ్వానించినట్లు ఈఈ సుభకుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల కట్ట కుంగిపోవడంతో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. దీంతో సోమవారం టెండర్ నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. రూ. 2.50 కోట్లతో చేపట్టే మరమ్మతు పనులు టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 3.50 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలంకు 7,279 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలోకి 7,279 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరింది. సుకేసుల జలాశయం నుంచి, సెల్ఫ్ క్యాచ్‌మెంట్‌లో కురిసిన వర్షం కారణంగా ఆదివారం నుంచి సోమవారం వరకు ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. డ్యాం పరిసర ప్రాంతాల్లో 46.20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో స్వల్పంగా 0.088 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 196 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు. బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సోమవారం సాయంత్రానికి జలాశయంలో 39.9680 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటి మట్టం 818.80 అడుగులకు చేరుకుంది.

శ్రీశైలం కిటకిట



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. సోమవారం వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జున స్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకుని, ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

పడమట ఉదయించి తూర్పున అస్తమించి!

- ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ఉత్థాన పతనం
- నిరుపేద గుండెకు బలాన్నిచ్చిన ఉద్యమం
- నల్లమల నుంచి దండకారణ్యానికి మార్పు
- దారిపొడుగునా రక్త తర్పణలే
- తాజాగా అబూజ్ మడ్ అడవుల్లో జిల్లా మహిళ ఎన్‌కౌంటర్





దాదాపు 35 ఏళ్ల క్రితం పేదరికం, భూస్వాముల అణిచివేత, నిరుద్యోగం, కరువు.. ఇలా ఎన్నో కారణాలు వారిని విప్లవ బాట వైపు అడుగులు వేయించాయి. పేదల పక్షాన పోరాడుతామంటూ తుపాకీ చేత పట్టి నక్సల్స్‌గా, అన్నలుగా, అక్కలుగా మారిపోయారు. కుటుంబాలు, ఉన్నత చదువులు వదిలేసి అడవులకు చేరారు. కాలక్రమేణా ఎన్నో ఘటనలు, ఎన్నో పరిణామాలు.. ఎంతో మంది ఉద్యమంలోనే నేలకొరగగా.. మరికొందరు జనజీవన స్రవంతిలో కలసిపోయారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఒక మహిళ మృతి చెందగా, మరో వ్యక్తి పేరు తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో నల్లమల మీదుగా సాగిన మావోల ప్రయాణంపై కథనం.

ఆత్మకూరు రూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 90వ దశకం విప్లవ కమ్యూనిస్టు పార్టీలకు మహర్దశ కాలంగా చెప్పుకోవచ్చు. బల హీనులకు వాక్కును, బలాన్ని అందించిన జనశక్తి పార్టీ క్రమేపి జిల్లాలో అదృశ్యం కాగా, తరువాత మావోయిస్టు పార్టీగా మారిన పీపుల్స్‌వార్ పార్టీ 2004 చర్చల తరువాత దండకారణ్యానికి, ఆంధ్రా – ఒడిస్సా బార్డర్‌కు తరలిపోయింది. 1989లో ఆదోని రెవెన్యూ డివిజన్‌లో పీపుల్స్ వార్ పార్టీకి చెందిన కార్యకర్తలు తమ కార్యకలాపాలు ప్రారంభించారు. బాగా వెనుకబడిన ఈ ప్రాంతంలో పీపుల్స్‌వార్ వైపు యువత ఆకర్షితులయ్యారు. తెలంగాణాలోని కరీంనగర్ వాసి అయిన గుద్దెటి లింగమూర్తి జిల్లా కార్యదర్శిగా పార్టీని ఆర్గనైజ్ చేశారు. ఆదోనికి చెందిన ఉరుకుందప్ప.. లింగమూర్తికి చేదోడువాదోడుగా ఉండే వాడు. 1+2గా ఈ ప్రాంతంలో తొలుత పీపుల్స్‌వార్ దళం తిరుగాడింది. అయితే పెద్దగా అటవీ ప్రాంతం లేని కారణంగా వారి కార్యకలాపాలకు అడ్డంకిగా మారడంతో నాయకత్వం ఉద్యమాన్ని నల్లమల కేంద్రంగా నడిపింది. ప్రకాశం – కర్నూలు జిల్లాలో నల్లమల అడవి డివిజన్ పేరిట ఒక కమిటీని పీపుల్స్‌వార్ పార్టీ ఏర్పాటు చేసింది. ఈ డివిజన్‌లో ఇటు కర్నూలు జిల్లాలో బవనాసి, మహానంది దళాలు, అటు ప్రకాశం జిల్లాలో టైగర్ ప్రాజెక్ట్, నల్లమల దళాలు నల్లమలను తమ కార్యక్షేత్రంగా మలుచుకున్నాయి. ఈ నేపథ్యంలోనే పత్తికొండకు చెందిన సన్నిధి ఆంజనేయ బాబు మహానంది దళ కమాండర్‌గా ఉంటూ జిల్లాలో జరిగిన మొట్ట మొదటి ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆదోనికి చెందిన పద్మ అప్పటి పీపుల్స్‌వార్ జిల్లా కార్యదర్శి లింగమూర్తిని వివాహం చేసుకున్నారు. ఈమె పార్టీ పనులపై బయటకు వెళ్లినప్పుడు నెల్లూరు వద్ద మరో రాష్ట్ర నాయకుడు చింతల వెంకటస్వామి అలియాస్ సూర్యంతో ఆమె కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

వేంపెంట ప్రతీకార హత్యలు సంచలనం..

పీపుల్స్‌వార్ వర్గ పోరాట తీవ్రత వల్ల జరిగిన పాములపాడు మండలం వేంపెంట ఘటనలు రాష్ట్ర వ్యాప్త సంచలనానికి కారణమయ్యాయి. అప్పట్లో బొమ్మ శివయ్య అనే వ్యక్తిని పీపుల్స్‌వార్ దళం అనుమానంతో హత్య చేసింది. అయితే శివయ్య వర్గానికి చెందిన వారి చేతుల్లో గ్రామంలో 8 మంది దళిత, వెనుకబడిన వర్గాలకు చెందిన వారు హత్యకు గురయ్యారు. అందులో కొందరు సజీవ దహనం చేయబడ్డారు. ఇది రాష్ట్రంలోనే అతి పెద్ద సంఘటనగా సంచలనం రేపింది. అయితే వేంపెంటలో జరిగిన 8 మంది హత్యకు ప్రతీకారంగా అందుకు కారకులైన వారిని అడవికి రప్పించి మొత్తం 9 మందిని మావోయిస్టు పార్టీ ఊచకోత కోసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005లో మావోయిస్టులతో జరిపిన చర్చలు విఫలమయ్యాక ఈ ఘటన జరిగింది.

పోలీసు దుస్తుల్లో వచ్చి..

ఆత్మకూరు మాజీ శాసన సభ్యుడైన బుడ్డా వెంగళ రెడ్డిని టార్గెట్ చేసి పీపుల్స్‌వార్ దళం హత్య చేసిన ఘటన కూడా అప్పట్లో రాష్ట్రంలో పెను సంచలనాన్ని రేపింది. ఆత్మకూరు పట్టణంలోని కేసి కెనాల్ గెస్ట హౌస్‌లో ఉన్న ఆయనను పోలీసు దుస్తులతో వచ్చిన నక్సలైట్లు కాల్చి చంపి క్షణాల్లో మాయమయ్యారు.

మిగిలిన ఒకే ఒక్కడు..

నల్లమల నుంచి మావోయిస్టు పార్టీ దండకారణ్యానికి వెళ్లిన బ్యాచ్‌లలో ఆత్మకూరు మండలం వడ్లరామాపురానికి చెందిన సుగులూరి చిన్నన్న అలియాస్ విజయ్, అలియాస్ నాగన్న మాత్రమే ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మావోయిస్టుల్లో మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. కాంకేర్ – రాజ్ నంద్‌గావ్ బార్డర్ కమిటీలో ఆయన పని చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ పోలీసులు వడ్లరామాపురం చేరుకుని చిన్నన్న గురించి పూర్వ వివరాలు సేకరించారు.

నల్లమల నుంచే చర్చలకు..

2005లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలకు సిద్ధమవడంతో మావోల కేంద్ర నాయకత్వం నల్లమలలోని చిన్నారుట్ల నుంచి బయటకు వచ్చింది. అప్పటి మావోయిస్టు నాయకులు అక్కిరాజు హరగోపాల్, వెంకటాచలం, గణేశ్, జనశక్తి నాయకులు అమర్, రియాజ్ చర్చల ప్రతినిధులుగా పాల్గొన్నారు.

2005లో నల్లకాల్వ సమీపంలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన పోశయ్య



విప్లవ బాటలో ప్రాణాలు కోల్పోయి..

- నందికొట్కూరుకు చెందిన శ్యాంప్రసాద్ వరంగల్ ఆర్ఈసీ విద్యార్థి. ఈయన వరంగల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు.
- మహానంది వద్ద జరిగిన ఎన్ కౌంటర్‌లో అప్పటి దళ కమాండర్ సన్నిధి ఆంజనేయ బాబు మరణించాడు
- ఆత్మకూరు మండలం వడ్లరామాపురానికి చెందిన సుగులూరి లింగస్వామిని భానుముక్కల మలుపు వద్ద పోలీస్ కాల్పుల్లో మరణించాడు.
- ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీధర్ అనే మావోయిస్టు కొత్తపల్లె మండలం బావాపురం వద్ద ఎన్‌కౌంటర్‌లో మృతి.
- పెచ్చెరువు చెంచు గూడెంకు చెందిన కొండన్న సిద్ధాపురం చెరువు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి.
- నెల్లూరు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వడ్లరామాపురానికి చెందిన గొల్ల ఆంజనేయులు మరో ఇద్దరు మృతి.
- వరంగల్‌కు చెందిన పోశయ్య ఆత్మకూరు మండలం నల్లకాల్వ వద్ద ఎన్‌కౌంటర్‌లో మరణించాడు.
- పాములపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన లక్ష్మి ప్రకాశం జిల్లా లక్ష్మీపురం వద్ద జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి.
- కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన సుంకన్న ప్రకాశం జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి చెందాడు.
- ఆదోని మండలం కడితోట గ్రామానికి చెందిన ప్రకాష్ అనే మావోయిస్టు శ్రీకాకుళంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు.
- నల్లమల ఫారెస్ట్ డివిజన్ కార్యదర్శులుగా పని చేసిన సూర్యం అలియాస్ సామల వెంకటేశంను మైసూర్‌లో పట్టుకుని అనంతపురం నల్లమాడ సమీపంలోనూ, ఎర్ర ప్రసాద్ అలియాస్ యాదన్నను కడప జిల్లా రాయచోటి మండలం సుండుపల్లె సమీపంలో ఎన్‌కౌంటర్ చేశారని అప్పట్లో చర్చ జరిగింది.



దండకారణ్యం చేరి..

2005లో రాష్ట్రప్రభుత్వానికి మావోయిస్టు పార్టీకి మధ్య జరిగిన శాంతి చర్చలు విఫలం కావడంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున దాడులకు పాల్పడుతుందన్న ముందు చూపుతో మావోయిస్టు పార్టీ తన క్యాడర్‌ను మొత్తం దండకారణ్యం, ఏవోబీలకు తరలించింది. అయితే ఈ పని పూర్తి కాకమునుపే నల్లమలలో పలు ఎన్ కౌంటర్లలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ ఘటనతో మావోలకు కోలుకోలేని దెబ్బతగిలింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సాక్షాత్తు ఆపార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో బలయ్యాడు. ఈ ఘటనలోనే కర్నూలు జిల్లా ఆస్పరి మండలం ములుగుంద గ్రామానికి చెందిన సంగీత అలియాస్ లలిత కూడా మరణించింది. దాదాపు 20 ఏళ్ల క్రితం ఉద్యమంలో చేరిన ఆమె ఇప్పటి వరకు గ్రామానికి రాలేదు. కనీసం ఆమె కుటుంబీకులకు చివరి చూపు దక్కుతుందా లేదా అనేది ఉత్కంఠ నెలకొంది. ఎన్‌కౌంటర్ సమాచారం అందుకున్న కుటుంబీకులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. సోమవారం కూడా ఆమె మృతదేహాన్ని అప్పగించలేదని తెలుస్తోంది.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

- విచ్చలవిడి మద్యం అమ్మకాలతో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు

బొమ్మలసత్రం: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు బదులుగా మద్యాన్ని డోర్‌డెలివరీ చేస్తుండటంతో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని కూటమి నేతలు మద్యపాన రాష్ట్రంగా మార్చడంతో నేరాల సంఖ్య పెరిగి పోతుందన్నారు. మద్యం మత్తులో కామాంధులు బరితెగిస్తున్నారన్నారు. సోమవారం స్థానిక ఉదయానంద హోటల్‌లో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి నంద్యాల జిల్లా పార్టీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జ్ దారా సుధీర్‌కుమార్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్పలతారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు ఒంటరిగా తిరగలేని పరిస్థితిని కూటమి నేతలు తీసుకొచ్చారన్నారు. చాగలమర్రికి చెందిన నాలుగేళ్ల చిన్నారి గుడికి వెళితే మద్యం మత్తులో ఉన్న కామాంధుడు అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో చిన్నారులు గుడికి, బడికి వెళ్లినా ఇంటికి తిరిగి వస్తారన్న నమ్మకం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం ఏరులై పారుతుండటం వల్లే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని, విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను అరికట్టాలని చిన్నారి తల్లి ఆవేదన చెందటమే ఇందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వంలో 30 వేల మంది మహిళలు కనిపించకుండా పోయారని ఎన్నికల ముందు కూటమి నేతలు గగ్గోలు పెట్టారని తీరా అధికారంలోకి వచ్చాక మహిళల ప్రాణాలకు సైతం రక్షణ కల్పించలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఊరూరా మద్యం దుకాణాలు, బెల్టు దుకాణాలు 24 గంటలు కొనసాగుతున్నాయన్నారు. తమ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలుగా నియమించటం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల నుంచి నేతల దాకా అందరినీ సమన్వయ పరుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తలకు ధైర్యం నింపుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చూస్తామన్నారు.

వినతుల పరిష్కారంపై శ్రద్ధ చూపండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి


నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన వినతులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీఓపెన్ అయిన 48 దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 1,374 ఫిర్యాదులకు సంబంధించిన ఆడిట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా మన మిత్ర క్యాంపెయిన్ కు సంబంధించి ఇంకా 12,724, సిటిజన్ ఈకేవైసీ 2,23,024, చిల్డ్రన్ వితౌట్ ఆధార్ 6,554, హౌసింగ్ ఇమేజ్ జియో కోఆర్డినేట్‌కు సంబంధించి 622 పెండింగులో ఉన్నాయని వాటిని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో 246 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా శ్రీశైలంలో 35.2మి.మీ వర్షపాతం నమోదైంది. డోన్‌లో 1.2 మి.మీ, పగిడ్యాల, వెలుగోడు 19.2, నందికొట్కూరు 18.2, మిడుతూరు 14.6, జూపాడుబంగ్లా 13.8, గడివేముల 12.2, కొత్తపల్లి 10.6, బండిఆత్మకూరు 7.8, ఆత్మకూరు 7.6, పాములపాడు, ఆళ్లగడ్డ 6.8, రుద్రవరం, గోస్పాడు 3.2, పాణ్యం 2.6, చాగలమర్రి 2.4 మి.మీ వర్షం కురిసింది. ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

కోటీశ్వరుడి కోడలికి జాబ్‌కార్డు

- ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుపై టీడీపీ నేత కన్ను
- సొంతూల్లో పని చేసేందుకు మొహమాటం
- పక్క ఊరిలో పని చేసినట్లు ఫొటోకు ఫోజు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటో
- చర్చనీయాంశంగా మారిన అధికారుల తీరు



దండె కావ్య ప్రవల్లికకు సంబంధించిన జాబ్ కార్డు



కావ్య పనులకు హాజరైనట్లు అధికారులు అప్‌లోడ్ చేసిన ఫొటో

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేతల బరితెగింపునకు మరో నిదర్శనం ఇది. ఓ నాయకుడు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోడలికి ఇప్పించేందుకు చేస్తున్న లీలలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గోస్పాడు మండలం దీబగుంట్లలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ గత కొంత కాలంగా ఖాళీగా ఉంది. అయితే ఇసుకపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి తన కోడలికి ఈ పోస్ట్ ఇప్పించుకోవాలనుకున్నాడు. ఇదే తడవుగా దండె కావ్య ప్రవల్లిక పేరు మీద పది రోజుల క్రితం అధికారుల సహకారంతో జాబ్‌కార్డు పుట్టించాడు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్‌కు అర్హత సంపాదించాలంటే జాబ్ కార్డు ఉన్న వ్యక్తి 25 రోజులు కూలీలతో పాటు పనిచేసి ఉండాలి. టీడీపీ నాయకుడు ఈశ్వరరెడ్డి ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తి కావటంతో దీబగుంట్లలో అప్పటికే 700 మందికి పైగా కూలీలు ఉన్న ప్రాంతానికి తన కోడలిని పనికి పంపలేకపోయాడు. ఎలాగైనా పోస్టు దక్కించుకోవాలనే తపనతో సమీపంలోని పసురపాడు గ్రామంలో కావ్య ప్రవల్లిక పనిచేస్తున్నట్లు ఫొటో తీసుకున్నారు. అక్కడి అధికారులు ఆమెను నిలబెట్టి పనిచేస్తున్నట్లు కాకుండా తానొక్కటి పనిని పరిశీలిస్తున్నట్లు ఫొటోలు దింపారు. ప్రస్తుతం ఈ ఫొటోలు మండలంలో వైరల్ కావడంతో అక్కడి గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. కోటీశ్వరుల కుటుంబ సభ్యులకు జాబ్ కార్డు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఆలయ ప్రతిష్ఠోత్సవాలకు రాజకీయ రంగు

ఎస్.చెన్నంపల్లెలో రామాలయ నిర్మాణం

- ఈనెల 29నుంచి 31 వరకు ప్రతిష్టా కార్యక్రమాలు
- వారం రోజులుగా అనుమతివ్వని పోలీసులు
- టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టాలని హుకుం
- మాజీ ఎమ్మెల్యే హాజరు కాకూడదని మెలిక



నిర్మాణం పూర్తయిన సీతారామాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసులను అడ్డుపెట్టుకొని చేస్తున్న అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. చివరకు ఆలయాలు, దేవుళ్లనూ వదిలిపెట్టని పరిస్థితి. కొలిమిగుండ్ల మండలం ఎస్.చెన్నంపల్లెలో ఆలయ ప్రతిష్ఠోత్సవాలు జరగకుండా పోలీసులను అడ్డుపెట్టుకొని అనుమతివ్వకుండా అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయనే దురుద్దేశంతో ఈ నీచానికి దిగజారారు. రెండు రోజుల్లో ప్రతిష్టా కార్యక్రమాలు జరగాల్సి ఉండగా ఆగిపోవడంతో గ్రామస్తులతో పాటు భక్తులు కూటమి నాయకుల తీరుపై మండిపడుతున్నారు. ఆలయం నిర్మాణం పూర్తి కావడంతో నెల రోజుల ముందుగానే ప్రతిష్టకు సంబంధించి వేదపండితులతో చర్చించి సాంప్రదాయ బద్ధంగా ఆలయాన్ని ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ముందు నుంచి వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులే ఆలయ నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. పార్టీలకతీతంగా గ్రామస్తులందరూ కలసికట్టుగా చేసుకోవాలని ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీ నాయకుల ఇంటింటికి వెళ్లి ప్రతిష్టా కార్యక్రమానికి ఆహ్వానించారు. దైవ కార్యక్రమం అనే ఆలోచన లేకుండా అధికారం మాది, మా కనుసన్నల్లో ప్రతిష్ట జరగాలనే దుర్బుద్ధితో పోలీసుల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి ప్రతిష్ట చేయకుండా అడ్డుకోవడం విమర్శలకు తావిస్తోంది.

కాటసాని హాజరు కాకూడదని..

ఆలయ ప్రతిష్ట ఉత్సవాలకు సంబంధించి నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదపండితులు మొదలుకొని షామియానాలు, అన్నదానం కోసం సర్వం సిద్ధం చేసి అడ్వాన్సులు కూడా చెల్లించారు. ఊర్లో మొదటి సారిగా కొత్త గుడి ప్రారంభం కానుండటంతో పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్లకు రంగులు వేసుకొని ముస్తాబు చేసుకొని బంధువులను ఆహ్వానించారు. కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో వేడుకలకు నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లడంతో కథ అడ్డం తిరిగింది. ఆలయ ప్రారంభానికి అనుమతి ఇవ్వకుండా పోలీసులు వారం రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పుకున్నారు. దాతలు ఇచ్చిన విరాళాల పుస్తకాన్ని పరిశీలించి ఎక్కువ భాగం వైఎస్సార్‌సీపీ నాయకులే ఉన్నారు.. టీడీపీ నాయకులతో ఎందుకు విరాళాలు ఇప్పించుకోలేదని ప్రశ్నించారు. ఆలయం ప్రారంభం కావాలంటే కొన్ని కండిషన్‌లు విధించారు. అందులో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్యంగా ప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కాకూడదనే మెలిక పెట్టారు. గ్రామంలోని టీడీపీ నాయకుల ఆధ్వర్యంలోనే ఉత్సవాలు జరగాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రతిష్టకు రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో చేసేదిలేక ఆలయ ప్రారంభోత్సవానికి బ్రేక్ పడింది. దేవుడి దగ్గర నీచ రాజకీయాలకు పాల్పడిన కూటమి నాయకులతో పాటు వారి చెప్పుచేతల్లో మెలుగుతున్న పోలీసుల వ్యవహారశైలిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిదేళ్లకు ఆలయం పూర్తి

గ్రామంలో శిథిలావస్థలో ఉన్న చిన్న చెన్నకేశవ స్వామి ఆలయం తప్ప మరో ఆలయం లేదు. ఆ ఆలయంలో కూడా పెద్దగా పూజలు జరిగేవి కావు. ఊర్లో మంచి ఆలయాన్ని నిర్మించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు భావించారు. 2017లో తిరుమల తిరుపతి దేవస్థానం తరపున సీతారామాలయం నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో ఆలయ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. పెరిగిన ఖర్చులతో ఆ నిధులు సరిపడకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఆలయం మొదలు పెట్టి తొమ్మిదేళ్లు అవుతుందని భావించి త్వరగా పూర్తి చేయాలనుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇతర గ్రామాలకు చెందిన పార్టీ నాయకులతో ఎక్కువ భాగం విరాళాలు సేకరించారు. వాటి ద్వారా త్వరగా పనులు పూర్తి చేశారు.

క్లుప్తంగా

నేటితో ముగియనున్న సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: జిల్లాలోని 69 కేంద్రాల్లో జరుగుతున్న పది సప్లమెంటరీ పరీక్షలు నేటి(మంగళవారం)తో ముగియనున్నారు. సోమవారం జరిగిన పరీక్షలకు 1265 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 4962 మంది విద్యార్థులకుగాను 3697 మంది హాజరైయ్యారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మొత్తం 13 కేంద్రాలను తనిఖీ చేశారు.

వృద్ధుడి ప్రాణం తీసిన కరెంట్



గొల్ల ముద్దయ్య (ఫైల్)

ఆదోని అర్బన్: మంచినీళ్ల కోసం మోటార్‌ను ఆన్ చేస్తూ ఓ వృద్ధుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ దుర్ఘటన విరుపాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ గొల్ల ముద్దయ్య(60) అనే వృద్ధుడు జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య రాగమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఉదయం మంచినీరు వస్తున్నాయని తెలుసుకుని గొల్ల ముద్దయ్య మోటార్ ఆన్ చేస్తూ విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్విచ్ ఆన్‌లో ఉన్నా కూడా ప్లగ్‌ను పెట్టబోయాడని, దీంతో విద్యుత్ షాక్‌కు గురైనట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

వెలుగోడు: బోయరేవుల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శాబోలు నరసింహుడు (70) మృతి చెందాడు. ఏఎస్‌ఐ హుస్సేన్ వివరాల మేరకు.. బోయరేవుల గ్రామానికి చెందిన శాబోలు నరసింహుడు బోయరేవుల బస్ స్టాండ్ వద్ద రోడ్డుకు ఎడమ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా డ్రైవర్ జంబి రాజేంద్ర కారును అతివేగంగా నడుపుతూ వెనుకవైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నరసింహుడిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ హుస్సేన్ తెలిపారు.

పోలీసులు లేక.. వేలం పాటలు వాయిదా

శిరివెళ్ల: మండలంలోని గుండంపాడు, శిరివెళ్లలోని ఆలయాల మాన్యం భూముల కౌలు బహిరంగ వేలం పాటలు వాయిదా పడ్డాయి. ముందుగా ప్రకటించిన మేరకు ఈనెల 26వ తేది వేలం పాట జరగాల్సి ఉంది. అయితే కడపలో జరిగే మహానాడుకు స్థానిక పోలీసులు బందోబస్తు విధులకు వెళ్లారు. దీంతో వేలం పాట నిర్వహణకు పోలీసులు రాలేని పరిస్థితి ఉందని ఎస్‌ఐ చిన్న పీరయ్య పేర్కొనడంతో ఆయన సూచన మేరకు జూన్ 4వ తేదీకి వేలం పాటలు వాయిదా వేశామని ఆయల ఈఓ రామాంజనేయ శర్మ తెలిపారు. ఈ మార్పును రైతులు గమనించాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు శివారులోని డోన్ హైవేలో మానస ధాబా ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుంది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 91211 01063 లేదా 91211 01064 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

చందా ఇస్తేనే పంటలకు నీరు!

- రైతుల నుంచి టీడీపీ నాయకుడి బలవంతపు వసూళ్లు
- పంట కాలువ బాగు కోసం దండోరా
- ఎకరానికి రూ.1000 ఇవ్వాలంటూ చాటింపు
- రాష్ట్ర ప్రభుత్వం పని చేయాల్సి ఉన్నా.. విరుద్ధంగా వ్యవహారం



సూగూరు మైనర్ ఇరిగేషన్ జలాశయం



పిచ్చిమొక్కలతో కానరాని పంట కాలువ

మంత్రాలయం: ''వినండహో.. ఇందు మూలంగా రైతులకు తెలియజేయడం ఏమనగా .. మన ఊరి పంట కాలువ పిచ్చిమొక్కలు, కంపచెట్లతో కూరుకుపోయింది. పంట కాలువను బాగు చేసుకునేందుకు చందాలు ఇవ్వాలని నిర్ణయం. కావున రైతులంతా చందాలు ఇచ్చుకోగలరు.. లేదంటే మీ చేనుకు నీళ్లు రావు.. వినండహో..'' అని మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామంలో టీడీపీ నాయకుడు దండోరా వేయిస్తున్నాడు. వాస్తవంగా పంట కాలువలను బాగు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వం. అయితే ఇక్కడ టీడీపీ నాయకుడు అందుకు విరుద్ధంగా వ్యహరిస్తున్నాడు.

కాలువ ఏర్పాటు ఇలా..

మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామం పైభాగంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద సూగూరు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు నెలకొల్పారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. పథకం కింద 2,700 ఎకరాల ఆయకట్టు నిర్ణయించారు. బూదూరు, సూగూరు, వగరూరు, వి.తిమ్మాపురం గ్రామాలకు నీరందించాల్సి ఉంది. అయితే పంట కాలువల నిర్వహణ గాలికి వదిలేయడంతో పూర్తిస్థాయిలో సాగునీరు అందని వైనం. ప్రస్తుతం వగరూరు, వి.తిమ్మాపురం గ్రామాల పరిధిలో 1,500 ఎకరాలకు సాగునీరు ఇస్తున్నారు. అందులో వగరూరు గ్రామంలో 1,000 ఎకరాలకు సాగునీరు పారుతోంది. జలాశయంలో వరద నీరు పుష్కలంగా ఉంటే రెండు కారుల పంటలు ఇక్కడి రైతులు తీస్తున్నారు.



గ్రామ వీధుల్లో దండోరా వేస్తున్న దృశ్యం

టీడీపీ నాయకుడి దాష్టీకం..

రాష్ట్ర ప్రభుత్వం పంట కాలువ మరమ్మతులకు నయా పైసా కేటాయించలేదు. ఇదే అదునుగా చేసుకున్న గ్రామ టీడీపీ నాయకుడు పంట కాలువ బాగు కోసం సరికొత్త పథాన్ని ఎంచుకున్నాడు. సోమవారం గ్రామంలో కాలువ రిపేరీ పేరుతో ఏకంగా దండోరా వేయించారు. కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు ఎకరానికి రూ.వెయ్యి, మోటార్లతో నీరు తోడుకునే రైతులు ఎకరానికి రూ.500 ఇచ్చుకోవాలని చాటింపు వేయించారు. ఇచ్చుకోని రైతుల పొలాలకు నీరు పెట్టుకోవడానికి లేదంటూ ఊరి వీధుల్లో దండోరా కొట్టించారు. గ్రామ టీడీపీ నాయకుడు అబ్దుల్లా ఆజ్ఞ మేరకు చాటింపు వేయించారు.

మునుపటికి భిన్నంగా

ప్రాజెక్టు పరిధిలో పంట కాలువ బాగు కోసం మునుపెన్నడూ దండోరా వేయించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులతో పంట కాలువను బాగు చేయించింది. కూటమి ప్రభుత్వం పుణ్యమా అని ఈ ఏడాది రైతులపై భారం పడేలా చేసింది. కాలువను బాగు చేయడానికి పైసలు ఇవ్వకపోవడంతో రైతుల నుంచి వసూళ్లు చేసేందుకు టీడీపీ నాయకుడు ముందుకు రావడం చర్చనీయాంశమైంది. దండోరాను చూసి రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదే దర్రిద్యమని వాపోతున్నారు. ప్రభుత్వానికి సిగ్గుచేటని దుమ్మెత్తిపోస్తున్నారు.

చాటింపు వాస్తవమే

మా ఊరి కాలువ పిచ్చిమొక్కలు, కంపచెట్లతో కూరుకుపోయింది. సాగునీరు సరఫరా చాలా ఇబ్బందులు ఉన్నాయి. కాలువ బాగు చేసుకునేందుకు నేనే ఊర్లో చాటింపు వేయించాను. కాలువ నుంచి నేరుగా నీళ్లు పెట్టుకునే వారికి ఎకరానికి రూ.1000, మోటార్ల ద్వారా నీళ్లు పెట్టుకునే రైతులు ఎకరానికి రూ.500 ఇవ్వాలని దండోరా కొట్టించాను. ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో ఇలా చేయాలని నిర్ణయించాం.

–అబ్దుల్లా, గ్రామ టీడీపీ నాయకుడు

డబ్బులు ఇవ్వాలంటే కష్టమే



కాలువ పనులు చేయడానికి గ్రామంలో దండోరా వేయించారు. కాలువ పనులకు ఎకరానికి రూ.1000 ఇవ్వాలని చెప్పారు. కాలువ పరిధిలో నాకు మూడు ఎకరాలు ఉంది. రూ.3 వేలు భరించాలంటే ఇబ్బందే. ప్రభుత్వం నుంచి పైసా సాయం లేదు. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో రైతులు డబ్బులు ఇవ్వాలంటే కష్టమే. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మా కాలువను బాగు చేసింటే బాగుండు.

–చిన్న ఉసేని, గ్రామ రైతు

మల్లన్న సేవలో సినీ హీరో అర్జున్



ఆలయంలో గోసేవ నిర్వహించుకుంటున్న సినీ హీరో అర్జున్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ప్రముఖ సినీ హీరో అర్జున్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం శ్రీశైలం చేరుకుని వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అలాగే ఆలయంలో గోసేవ నిర్వహించుకున్నారు. సినీ హీరో అర్జున్‌తో కరచాలనం చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆయనతో పలువురు సెల్ఫీలు, ఫొటోలు దిగారు.

చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్

కర్నూలు(హాస్పిటల్): చిన్నారుల్లో తట్టు, పొంగు, రూబెల్లా వ్యాధుల నివారణే లక్ష్యంగా ఎంఆర్ వ్యాక్సిన్ ఆరు రోజుల పాటు వేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ చెప్పారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఎంఆర్ వ్యాక్సిన్‌పై స్పెషల్ ప్రారంభించామన్నారు. జిల్లాలో ఎంఆర్–1 వ్యాక్సిన్‌ను 33 మంది, ఎంఆర్–2 వ్యాక్సిన్‌ను 36 మంది వేయించుకోలేదని ప్రాథమికంగా తాము గుర్తించినట్లు తెలిపారు. వీరితో పాటు ఇంకా ఎవ్వరైనా వేయించుకోకపోయినా, ఇతర ప్రాంతాల వారున్నా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో, అంగన్‌వాడీ కేంద్రంలో, సచివాలయంలో వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

రెండురోజుల శిశువుకు అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం శిశువుతో డాక్టర్ కృష్ణనాయక్, వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): రెండురోజుల శిశువుకు అరుదైన ఆపరేషన్ నిర్వహించినట్లు కర్నూలు పెద్దాసుపత్రి చిన్నపిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఎం.కృష్ణనాయక్ చెప్పారు. ఆపరేషన్ వివరాలను సోమవారం ఆయన వివరించారు. ఆలూరు మండలం హాలహర్వి గ్రామానికి చెందిన రాజమ్మ, రాజశేఖర్‌ల రెండు రోజుల మగ శిశువుకు పుట్టుకతోనే పేగు అభివృద్ధి కాలేదన్నారు. దీనిని వైద్యపరిభాషలో జజునల్ అట్రిసియాక్ అంటారని తెలిపారు. ఇది చాలా అరుదుగా జరుగుతుందన్నారు. పేగుకు నిరంతరంగా కనెక్షన్ లేకుండా మధ్యలో తెగిపోయి ఉంటుందన్నారు. ఇలాంటి శిశువుకు ఈ నెల 17న ఆపరేషన్ చేసి సమస్యను పరిష్కరించామన్నారు. ఇప్పుడు శిశువు నోటి ద్వారా పాలు తాగుతూ ఆరోగ్యంగా ఉందన్నారు. ఆపరేషన్ తనతో పాటు అనెస్తీషియా వైద్యులు డాక్టర్ శాంతిరాజు, పిల్లల వైద్యులు డాక్టర్ రచన, పీజీ వైద్యులు పవన్‌కృష్ణ, సింధూర నిర్వహించినట్లు వివరించారు.

మద్యం మత్తులో దాడి

- తీవ్రంగా గాయపడిన యువకుడు

డోన్ టౌన్: పాత కక్షలను మనస్సులో ఉంచుకొని మద్యం మత్తులో ఒక యువకుడిపై ఆదివారం అర్ధరాత్రి దాడి చేశారు. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. డోన్ పట్టణం కొంపేటకు చెందిన నరసింహులు అతని స్నేహితుడు నిఖిల్‌తో కలిసి కేఈ మాదన్న నగర్ సమీపంలో స్కూటీపై వెళ్తున్నాడు. నలుగురు స్కూటీకి అడ్డుగా నిలబడి కంట్లో కారం చల్లి నరసింహులుపై దాడి చేశారు. దాడిలో నరసింహులు తలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. దాడి చేసిన వారు మద్యం మత్తులో ఉన్నారని తెలిసింది. బాధితుని స్నేహితుడు నిఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు.

ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలి

- కర్నూలులో రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, నిరసన



ఆటో కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ కోరారు. ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 2027 జనవరి వరకు ఎండీయూ వాహనాలను కొనసాగించాలన్నారు. ఆటో కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో ఎండీయూ ఆపరేటర్లు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆటో కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. కేశవయ్య, కార్యదర్శి అక్బర్‌వలి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేవలం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఉన్న కోపంతోనే చంద్రబాబు ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగిస్తోందన్నారు. ప్రభుత్వం తమతో చేసుకున్న గడువు వరకు కొనసాగించాలని, తరువాత కూడా ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉపాధిని చూపాలని ఎండీయూ ఆపరేటర్ల కోరారు. ఎండీయూ ఆపరేటర్లు అక్బర్‌వలి, కేశవ్, మహ్మద్‌రఫీ, వీరేష్, శీను, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కర్నూలు సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. నిరసనలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఎస్‌జీటీలకు మ్యానువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. ప్రత్యేక కేటగిరి కింద ఉపాధ్యాయులకు 40 శాతం, స్కూల్ అసిస్టెంట్లకు 50 శాతం బ్లాకింగ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. బదిలీల ప్రక్రియను వేగవంతం చేయకుండా రాష్ట్ర స్థాయి అధికారులు లేనిపోని సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. అనంతరం డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ నిరసన కార్యక్రమం దగ్గరకు వచ్చి ఉపాధ్యాయుల డిమాండ్లకు కమిషనర్ దృష్టికి తీసుకపోతామని హామీనిచ్చారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్, అప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉల్చాల రవికుమార్, నవీన్ పాటి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, ఏపీటీఎఫ్(1938) జిల్లా ప్రధాన కార్యదర్శి మారియానందం, ఏపీటీఎఫ్(257)జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న, అపాస్ కార్యదర్శి నాగిరెడ్డి, పీఈటీ–పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుకు ధరాఘాతం

- మార్కెట్‌లో పొగాకు పంటకు పడిపోయిన ధరలు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- రుణాలు చెల్లించాలని బ్యాంక్‌ల ఒత్తిడి
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

డోన్: పొగాకు పండించిన రైతుకు కన్నీరే మిగులుతోంది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో నష్టాలు వస్తున్నాయి. పంటకు పెట్టిన పెట్టుబడి రాకపోయినా బ్యాంక్‌లు రుణాలు చెల్లించాలని ఒత్తిడి తేవడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. డోన్ నియోజకవర్గంలో 258 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. ప్యాపిలి మండలంలో రాచర్ల, బూరుగుల, ప్యాపిలి, బేతంచెర్ల మండలంలో బుగ్గానిపల్లి, అంబాపురం, బేతంచెర్ల, డోన్ మండలంలో వెంకటాపురం, చిన్నమల్కాపురం, ఉడుములపాడు, వెంకటనాయునిపల్లి గ్రామాలలో ఎక్కువగా పొగాకు పంటను పండించారు. గత ఏడాది క్వింటా రూ.15వేల నుంచి రూ.18వేల ధర పలికింది. ప్రస్తుతం రూ.5వేల నుంచి రూ.7వేలకు పడిపోయింది. పంట సాగులో ఎకరాకు రూ.70వేల నుంచి రూ.80వేల ఖర్చు వచ్చింది. పండించిన పొగాకు చెక్కులు తీసుకెళ్తే ఐటీసీ, జీపీఐ, ఎలైన్ కంపెనీ నిర్వాహకులు తేమ శాతం ఎక్కువ ఉందని వెనక్కి పంపిస్తున్నారు. దీంతో రైతులు పొగాకు అమ్ముకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఒక్కో రైతు 10 నుంచి 15 చెక్కులు తీసుకెళ్తే అందులో తేమ శాతం రేటు ఎక్కువ ఉందని చెప్తున్నారు. దళారులు వచ్చి 'రూ. 5వేలకు ఇస్తావా? 4వేలకు ఇస్తావా?' అని అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. రైతులు ఇబ్బంది పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.



మండె వేసిన పొగాకు

నష్టమే మిగిలింది



ఈ ఏడాది రైతులు పండించిన కంది, పత్తి, పొగాకు మిరప పంటలకు ధర పూర్తిగా తగ్గిపోయింది. బ్యాంక్ అధికారులు మాత్రం రుణాలు కట్టమంటూ ఒత్తిడి చేస్తున్నారు. అప్పులు ఇచ్చే వాడే లేడు. రైతన్నకు ఏంచేయాలో అర్థంకాని రోజులు ఎదురయ్యాయి. వ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడే రోజులు వచ్చాయి.

– షేక్ హుసేన్, యు.కొత్తపల్లి,

కష్టంగా ఉంది



రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధరలేదు. నేను మూడు ఎకరాలలో పొగాకు నాటా. కింటా రూ.15వేల నుంచి రూ. 18వేల వరకు అమ్ముకున్నాం. ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేదు. వచ్చే ఏడాది పెట్టుబడికి కష్టంగా ఉంది.

– కోయికొండ చిన్నమద్దయ్య, ఉడుములపాడు

భార్యాభర్తలు గొడవ పడి.. శిశువును వదిలేసి!

కర్నూలు: డోన్ మండలం కొచ్చెర్వు గ్రామానికి చెందిన కృష్ణమోహన్, దుర్గ దంపతులకు ముగ్గురు పిల్లలు సంతానం. నాలుగు నెలల ఆడశిశువుకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో భార్యాభర్తలు గొడవ పడి శిశువును ఆసుపత్రిలోని పీఐసీయూ వార్డులో వదిలేసి వెళ్లారు. ఆలస్యంగా గుర్తించిన వార్డులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనపై దర్యాప్తు చేస్తుండగా కృష్ణమోహన్ దంపతులు విషయం తెలుసుకుని వారే స్వయంగా ఆసుపత్రి వద్దకు వచ్చారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది వారిని పోలీస్ స్టేషన్‌కు పంపారు. ప్రస్తుతం శిశువు ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో ఉంది. రెండు రోజుల తర్వాత బాల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శిశువును అప్పగిస్తామని వారి తల్లిదండ్రులకు చెప్పి పంపారు.

సచివాలయంలో ఇంటర్‌నెట్ ఇక్కట్లు

- సెల్‌ఫోన్ హాట్‌స్పాట్‌తో రెండు నెలలుగా సేవలు
- రేషన్ కార్డు దరఖాస్తులకు తప్పని అవస్థలు
- ఈకేవైసీ కోసం లబ్ధిదారుల పడిగాపులు



వెలుగోడు పట్టణంలోని సచివాలయం–2లో ఆధార్ నమోదు కోసం వేచి ఉన్న ప్రజలు

వెలుగోడు: గ్రామస్థాయిలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. కనీసం ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలం కావడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదు. పట్టణంలోని సచివాలయం–2లో రెండు నెలలుగా ఫైబర్ నెట్ ఇంటర్ నెట్ సేవలు నిలిచిపోయాయి. ఏపీ ఫైబర్ నెట్ పని చేయడం లేదని ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడు. దీంతో ఉద్యోగులు తమ సెల్ ఫోన్ హాట్ స్పాట్‌ను కంప్యూటర్‌కు కనెక్ట్ చేసుకొని విధులు నిర్వహిస్తున్నారు. సెల్ నెట్ సరిగా అందకపోవడంతో సర్వర్ సరిగా పని చేయక ప్రజలు గంటల తరబడి సచివాలయం వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. సచివాలయ వ్యవస్థ లేనప్పుడు గతంలో మండల కేంద్రానికి లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, కానీ స్థానికంగానే సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని వైఎస్ జగన్ తీసుకొచ్చారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేస్తూ సేవలన్నింటినీ వారి చెంతకే తీసుకొచ్చారు. గతంలో 35 విభాగాలకు సంబంధించి 545 ప్రభుత్వ సేవలను అందించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది.

మూడు ఆధార్ కేంద్రాలే దిక్కు

కూటమి ప్రభుత్వం ఈ నెల ఏడో తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. కాగా.. పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడటం.. ఒకేసారి వందలాది మంది సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు రావడంతో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో రోజుల తరబడి సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. మండలంలో కేవలం మూడు సచివాలయాల్లో మాత్రమే ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయి. వెలుగోడు పట్టణంలోని సచివాలయం–2లో ఇంటర్ నెట్ సౌకర్యం లేక ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేల్పనూరు, గుంతకందాల సచివాలయాల్లో మాత్రమే ఆధార్ నమోదు కేంద్రాలు పని చేస్తుండగా, వేల్పనూరులో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను అప్‌లోడ్ చేస్తుండటంతో తంబ్ వేసే అవకాశం లేకుండా పోయింది. సరిగా వేలిముద్రలు పడనవి ప్రస్తుతం పెండింగ్‌గా చూపడంతో పాటు కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో సమస్యలు తలెత్తాయి. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో పిల్లలు, పెద్దలవి ఈకేవైసీ పూర్తిచేయాలని భావించింది. ఈ మేరకు పెండింగ్ కార్డుదారుల జాబితాలను సిద్ధం చేసి డీలర్లకు అందించారు. ప్రస్తుతం ఈకేవైసీ పూర్తికాకపోతే స్మార్ట్ కార్డులు అందవనే ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంది. దీంతో రేషన్ కార్డుదారులు సచివాలయాల వద్దకు పరుగులు తీస్తూ ఈకేవైసీ చేయించుకునేందుకు పడిగాపులు కాస్తున్నారు. సకాలంలో ఈకేవైసీ పూర్తి చేసుకునేలా అన్ని సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.